ఏళ్ల నాటి కల సాకారం

- 15వ వార్డులో చకచకా సీసీ రోడ్ల నిర్మాణం
- కొత్త వెంకోజీపాలెంవాసుల ఆనందం

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా చేపడుతున్నట్లు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తెలిపారు. వార్డులోని కొత్త వెంకోజీపాలెం ప్రాంతవాసులు 20 ఏళ్లుగా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తూ కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజలకు ప్రధానంగా కావాల్సిన సదుపాయాల కల్పనకే పెద్దపీట వేస్తున్నామన్నారు. సీసీ రోడ్లతోపాటు డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. వర్షా కాలం ప్రారంభం కావడంతో ఎక్కడికక్కడ డ్రెయిన్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. పాత, కొత్త వెంకోజీపాలేల్లో సీసీ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ పనులను ఎప్పటికప్పుడు ఆమె పరిశీలిస్తున్నారు. ఏళ్ల నాటి రహదారి కల సాకారమవడంతో వెంకోజీపాలెంవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పాత వెంకోజీపాలెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు


కొత్త వెంకోజీపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు

20 ఏళ్ల కల నెరవేరింది

కొత్త వెంకోజీపాలెంలో 20 ఏళ్లుగా సీసీ రోడ్డు నిర్మించాలని అడిగి అడిగి విసిగి వేశారిపోయాం. ఆ కల తమ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవతో నెరవేరింది. తమ ప్రాంతంలో రహదారి లేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు సీసీ రోడ్డు వేయడంతో కాలనీకే కొత్త కళ వచ్చింది. వర్షం వస్తే బురదతో చిందర వందరగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి మారనుంది. కార్పొరేటర్‌కు ధన్యవాదాలు.
– అచ్యుత, కొత్త వెంకోజీపాలెం



నేరుగా ప్రజలకు సేవచేసే అవకాశం

ఏయూక్యాంపస్: వలంటీర్‌గా అప్పగించిన బాధ్యతను ఒక ఉద్యోగంలా భావించలేదు. నేరుగా ప్రజలకు సేవచేసే అవకాశంగా భావించాను. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంలో భాగం కావడం ఆనందాన్నిస్తోంది. కొన్ని సందర్భాల్లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు సైతం వెళ్లి వారికి పెన్షన్ సొమ్ము అందజేశాను. ఆ సమయంలో వారు పొందిన ఆనందం మాకు నిజమైన సంతృప్తినిచ్చాయి.
– యద్ది ఇందు, వలంటీర్, 17వ వార్డు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఇందు

ఆమె చేసిన సాయం మరువలేను

మద్దిలపాలెం : నా భర్త ప్రతాప్ కృపాల్ తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టారు. ఆయనకు ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు సర్టిఫికెట్ అవసరమైంది. మా వలంటీర్ బుడుమూరి భారతికి తెలియజేశాము. ఆమె వెంటనే ఇంటికి వచ్చింది. కదల్లేని స్థితిలో ఉన్న ఆయన వివరాలు తీసుకుని, దరఖాస్తు చేసింది. ధ్రువపత్రం రావడానికి ఎంతో సహకరించింది. ఇప్పుడు నా భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆ సర్టిఫికెట్ తీసుకురాకపోతే మాకు చాలా కష్టం అయ్యేది. అడుగు తీసి అడుగు వేయలేని ఆయన్ను ఎక్కడికి తీసుకుని వెళ్లగలను. ఆమె అందించిన సాయం మరువలేను.
– స్వజనకుమారి, సిద్ధార్థనగర్, 22వ వార్డు


వృద్ధుడి వద్ద వివరాలు తీసుకుంటున్న వలంటీర్ భారతి

క్లుప్తంగా

రైతుబజార్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్


రైతులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రతినిధులు

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌లో రైతులకు జీవీఎంసీ ప్రతినిధులు శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, ప్లాస్టిక్ వాడకం తదితర అంశాలపై కళాజాత ప్రదర్శించారు. రైతు బజారులో కూరగాయలు విక్రయించే రైతులు, డ్వాక్రా మహిళలు, వినియోగదారులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యార్థులకు కోలాటం కర్రల బహూకరణ


కోలాటం కర్రలు బహూకరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఏయూక్యాంపస్: స్థానిక 20వ వార్డులోని కేడీపీఎం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ సభ్యులు కోలాటం కర్రలను బహూకరించారు. విద్యార్థులు ఆగస్టు 15న కోలాటం ప్రదర్శన ఇవ్వనున్నందున్న వారు నేర్చుకునేందుకు వీలుగా కోలాటం కర్రలను అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేణు, కార్యనిర్వాహక కార్యదర్శి రవి కుమార్, పాఠశాల హెచ్‌ఎం సుమతీ బాయి, ఫిజికల్ డైరెక్టర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఉచిత దంత వైద్య శిబిరం


దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అణుభౌతిక శాస్త్ర విభాగంలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహించడంపై విభాగ ఆచార్యులను అభినందించారు. అనంతరం విభాగ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గీతం దంత వైద్య కళాశాల వైద్యుడు డాక్టర్ మనీష్ కుమార్, విభాగాధిపతి డాక్టర్ పి.వి.లక్ష్మీనారాయణ, ఆచార్య ఎ.దుర్గా ప్రసాదరావు, డాక్టర్ పి.వి.మధుసూదన రావు, డాక్టర్ ఎస్.అప్పన్న బాబు, డాక్టర్ ఎన్.వి సీతా మహాలక్ష్మి, పరిశోధకులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం నేడు

సీతంపేట: అనిల్ నీరుకొండ దంత వైద్యశాల వైద్యులచే ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లెట్స్ స్పీక్ స్పోకెన్ ఇంగ్లిష్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ రోడ్‌లోని తమ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. దంతాల క్లీనింగ్, పుచ్చుపళ్లకు సిమెంటు పెట్టడం, కదిలేపళ్లను తొలగించడం, నోటి ఆరోగ్యంపై అవగాహన, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 99597 51194 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వెన్నెదుర్గా నగర్‌లో కాలువల నిర్మాణం కోసం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీతతో కలసి శనివారం శంకుస్థాపన చేశారు. మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వెన్నెదుర్గానగర్‌లో రూ.16 లక్షలతో కాలువల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పనులు తొందరగా పూర్తి చేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. వార్డుల్లో ఇప్పటికే పలుచోట్ల కాలువలు, రోడ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, రాజు, శిరీష, డాక్టర్ నాయుడు, పిల్లి వీర్రాజు, దుర్గ్రావు, వెంకటరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


లక్ష్మి మృతదేహం

ఎంవీపీకాలనీ: కుటుంబ కలహాలతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురై ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బూసాల లక్ష్మి(25)కి రమేష్ అనే వ్యక్తితో 2014లో వివాహమైంది. వీరికి ఆరేళ్ల పాప ఉంది. తన భర్త వేధింపులతోపాటు కుటుంబ కలహాల కారణంగా 2018లో అతడిపై లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉండటంతో లక్ష్మి శివాజీపాలెంలోని అమ్మ, తమ్ముడు వద్ద ఉంటోంది. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అమ్మ, తమ్ముడితో కూడా ఆమె మాట్లాడటం లేదు. శుక్రవారం వారిద్దరూ పనిమీద బయటకు వెళ్లారు. సాయంత్రం వచ్చి ఇంటి తలుపులు ఎంతసేపు కొట్టినా తీయలేదు. దీంతో అనుమానం వచ్చి వేరే మార్గం ద్వారా లక్ష్మి తమ్ముడు లోపలికి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించింది. దీంతో వారు ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతురాలి తమ్ముడు మురుకోటి కోటిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

ఎంవీపీ రైతుబజారులో బియ్యం కౌంటర్ ప్రారంభం

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజారులో బియ్యం, కందిపప్పు కౌంటర్ అందుబాటులోకి వచ్చింది. జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథన్ శనివారం ఈ కౌంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బయట మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు ఎక్కువగా ఉండటంతో, వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతుబజారులో సరసమైన ధరలకు వాటిని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు, మిల్లర్లతో సంప్రదింపులు జరిపి, కౌంటరు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇక్కడ బియ్యం ఫైన్ వెరైటీ బీపీటీ సన్నాలు కిలో రూ.46కి, దేశవాళీ రకం కందిపప్పు కిలో రూ.137కి విక్రయిస్తారని తెలియజేశారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బయట మార్కెట్‌లో వాటి ధరలు తగ్గేంతవరకు రైతు బజార్‌లో కౌంటర్ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, రైతు బజార్ ఈవో జి.ప్రసాద్, సహాయకుడు జి.కనకరాజు, బియ్యం హోల్‌సేల్ వ్యాపారులు పాల్గొన్నారు.


వినియోగదారుడికి బియ్యం అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వైద్యులు, ఏఎన్‌ఎంలతో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం సీజనల్ వ్యాధులపై ఏఎన్‌ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వానా కాలం నేపథ్యంలో వర్షాలు విస్తరంగా కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో వ్యాధులపై వైద్యులు, ఏఎన్‌ఎంలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ నేషనల్ ఫీవర్ హెల్త్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మార్గదర్శక సూత్రాల ప్రకారం సర్వే చేసి వివరాలను యాప్స్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ విషయంలో ఏఎన్‌ఎంలు, వైద్యులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు డాక్టర్ సత్యవేణి, డాక్టర్ సమత, నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, వివిధ ప్రోగ్రాంల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

విభేదాలకు పరిష్కారం యూసీసీ కాదు

సీతంపేట: భిన్నత్వాల మనుగడే ప్రజాస్వామ్యానికి ఉనికి అని, అసమాన సమాజంలో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) ఎవరి ప్రయోజనాల కోసమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో యూసీసీపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై అన్ని మతాల్లోని అనాచారాలను తొలగించేందుకు, రాజ్యాంగ బద్ధ హక్కులను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలే తప్ప.. యూసీసీ అవసరం లేదని 2018లో వేసిన లా కమిషన్ చెప్పిందని గుర్తు చేశారు. విభేదాలు ఉన్నంత మాత్రాన వాటికి పరిష్కారం యూసీసీ కాదని చెప్పిందని, 21వ లా కమిషన్ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసిన పాలకులు తమ రాజకీయ లబ్ధి కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారని విమర్శించారు. డ్రాఫ్ట్‌పై చట్టసభలో చర్చించకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఆఘమేఘాల మీద రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయించాలని చూస్తున్నారన్నారు. ఈ విధానాన్ని ప్రగతిశీల మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.

పోలమాంబకు సారె సమర్పణ


సారె తీసుకువస్తున్న భక్తులు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

ఏయూక్యాంపస్: పోలమాంబ అమ్మవారికి భక్తులు శనివారం సారె సమర్పించారు. ఉదయం పెదవాల్తేరు గ్రామంలోని పెద్దింటి నుంచి పెద్దసంఖ్యలో భక్తులు సారెను పట్టుకుని కాలినడకన పోలమాంబ ఆలయం వరకు విచ్చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు తమ శక్తికొలది అమ్మవారికి సారెను సమర్పించారు. అమ్మవారి పెద్దింటి వద్ద నిర్వహించిన పూజల్లో నగర మేయర్ జి.హరి వెంకట కుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల పాల్గొన్నారు. ఆలయం వద్ద అమ్మవారికి సారె సమర్పించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకట రావు, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, కార్పొరేటర్ గేదెల లావణ్య, ట్రస్ట్ బోర్డు చైర్మన్ శంకర రెడ్డి, మాజీ కార్పొరేటర్ విజయ చంద్ర, ఆలయ ఈవో సురేష్ బాబా, ట్రస్ట్ బోర్డు సభ్యులు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారికి నమస్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

108 రథసారథులకు శిక్షణ

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ (ఏఇఎంఎస్) ఆధ్వర్యంలో నడిపిస్తున్న 108, 104,102 సర్వీసులో పని చేస్తున్న పైలెట్లకు శిక్షణ నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు వర్షాకాలం నేపథ్యంలో పైలెట్లకు డ్రైవింగ్‌లో మెలకువలు, సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, డిస్ట్రిక్ట్ మేనేజర్ త్రినాథ్, విశాఖ సిటీ కోఆర్డినేటర్ సురేష్, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు

ఎమ్మెల్యే ప్రచారం

ఎంవీపీకాలనీ: తెలుగు దేశం పార్టీ 'భవిష్యత్‌కు గ్యారంటీ' పేరుతో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై శనివారం పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించాయి. 17వ వార్డు ఆదర్శనగర్‌లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి, పథకాలపై ప్రచారం చేశారు. పార్టీ నాయకులు చోడే పట్టాభి రామ్, నెక్కంటి సత్తిబాబు, రాములమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెచ్‌పీసీఎల్ ఆవిర్భావ దినోత్సవం


గ్యాస్ సరఫరా బాయ్స్‌కు మొక్క అందజేస్తున్న మహేష్‌రామ్

సింహాచలం: కరోనా సమయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా చేయడంలో డెలివరీ బాయ్స్ ప్రధాన పాత్ర పోషించారని హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ మహేష్‌రామ్ కొనియాడారు. హెచ్‌పీసీఎల్ 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని 94వవార్డు వేపగుంటలోని సత్యమహాలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌రామ్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ 49ఏళ్లు పూర్తి చేసుకుని 50వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ గొడౌన్ ఆవరణలో మొక్కలు నాటారు. డెలివరీ బాయ్స్‌కు మొక్కలు అందజేశారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎల్‌పీజీ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అన్నవరపు సుందరవదన్, డిప్యూటీ సేల్స్ మేనేజర్ మురళీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్స్) ప్రేమ్‌కుమార్ జ్యోతి, చీఫ్ మేనేజర్ సంజయ్‌కుమార్, ఏరియా సేల్స్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కె.ఎల్.రావు సేవలు నిరుపమానం


కె.ఎల్.రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: దేశ నీటి పారుదల రంగానికి డాక్టర్ కె.ఎల్.రావు అందించిన సేవలు నిరుపమానమని ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి అన్నారు. కె.ఎల్.రావు జయంతి సందర్భంగా శనివారం విభాగంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగార్జున సాగర్ డ్యామ్, బాక్ర డ్యామ్‌ల నిర్మాణంలో కె.ఎల్.రావు సహకారాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు వై.అబ్బులు, పి.వి.వి.సత్యనారాయణ, వజీర్ మహ్మద్, కె.శ్రీనివాసరావు, ఎస్.ఆదిశేషు, ఐ.శివపార్వతి, మునిస్వామి, డాక్టర్ టి.ఉష మాధురి, డాక్టర్ కె.రాజశేఖర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

70 కిలోల గంజాయి పట్టివేత

ఆరిలోవ: ఆరిలోవ పోలీసులు గంజాయి తరలిస్తున్న ఏడుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయి బ్యాగులను ముళ్ల తుప్పల్లో గుట్టుగా దాచి, అనంతరం వేరే ప్రాంతానికి తరలిస్తుండగా పోలీసులకు చిక్కారు. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ వ్యాలీ స్కూల్ సమీపంలోని కూచిపూడి కళాక్షేత్ర వెనుక ముళ్ల పొదల్లో గంజాయి మూటలను గోనె సంచుల్లో పెట్టి దాచిపెట్టారు. వాటిని శనివారం ఏడుగురు యువకులు బయటికి తీసి, కారులో వేరే ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న టాస్క్ ఫోర్స్, ఆరిలోవ పోలీసులు వెంటనే విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డుకు వెళ్లి, అప్పటికే కారులో ఎక్కించిన గంజాయి మూటలతో ఆ ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి నుంచి సుమారు 70 కిలోల గంజాయి, కారు స్వాధీనం చేసుకుని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.


పోలీసులు పట్టుకున్న గంజాయి మూటలు, వాటిని తరలిస్తున్న యువకులు

ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

మద్దిలపాలెం: ప్రజా రవాణాశాఖలో ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నానని ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. మద్దిలపాలెంలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ విలీనం తర్వాత ఉద్యోగులకు అందాల్సిన సదుపాయాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరాజు, పి.వి.వి.మోహన్, నర్సింగరావు,అప్పారావు, తిరుపతి జిల్లా కార్యదర్శి బి.ఎస్.బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోటి శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం

దాబాగార్డెన్స్ : గీతా ప్రచార సమితి ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం నిర్వహించిన కోటి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, లక్ష తులసి పూజ శనివారం వేదసభతో ఘనంగా ముగిసింది. బ్రహ్మశ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి సారథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు, ఘనాపాటీలు పాల్గొని చతుర్వేద పారాయణం చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ దైవానుగ్రహంతోనే కోటి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం సాంప్రదాయ రీతిన అత్యంత వైభవంగా జరిగిందన్నారు. కార్యక్రమం నిర్వహించిన కమిటీ సభ్యులను ప్రశంసించారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు వేదసభలో పాల్గొన్న వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంస్థ గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, మహిళా సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


లక్ష తులసి పూజలందుకున్న కృష్ణ భగవానుడు